# గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలి

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి




కరీంనగర్, జనతా న్యూస్: ఈనెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు.

గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తో కలిసి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పోలీస్ కవాతు మైదానంలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించి స్టేజ్ ఏర్పాటు, పార్కింగ్ సదుపాయాలు, విద్యుత్, అలంకరణ, సౌండ్ సిస్టమ్ వంటి అన్ని మౌలిక సదుపాయాలను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో తాగునీటి సదుపాయం కల్పించాలని ఆదేశించారు. విద్యుత్, ఫైర్ శాఖల అధికారులు పూర్తి స్థాయి అప్రమత్తతతో ఉండాలని తెలిపారు. పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి, చిన్నారులు అధిక సంఖ్యలో వేడుకలకు హాజరయ్యేలా చూడాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. అలాగే వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేసి, ప్రజలకు ప్రభుత్వ సేవలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. 108, 102 అంబులెన్స్ సేవలు, బాల రక్షక్, సఖి వాహనాలను ప్రదర్శనలో ఉంచాలని ఆదేశించారు. ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు ఉత్తమ సేవలు అందించిన సిబ్బంది పేర్లను పరిశీలించి నివేదికలు పంపాలని తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ, గణతంత్ర దినోత్సవ వేడుకలకు పోలీస్ కవాతు మైదానంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. పోలీస్ బందోబస్తుతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పురపాలక ఎన్నికల నిర్వహణకు సంసిద్ధంగా ఉండాలి

**రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని**

**మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**




కరీంనగర్, జనవరి 20: పురపాలక ఎన్నికల నిర్వహణకు జిల్లాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సంపూర్ణంగా సంసిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని మంగళవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కరీంనగర్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌ను త్వరలోనే కమిషన్ విడుదల చేస్తుందని తెలిపారు. షెడ్యూల్ విడుదలైన వెంటనే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, పురపాలక ఎన్నికల నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, నామినేషన్ పరిశీలన, పోలింగ్ నిర్వహణ, కౌంటింగ్ ప్రక్రియలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండే భద్రతా సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ సౌకర్యం ఉండాలని, పోలింగ్ కేంద్రాల వెలుపల సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అసాంఘిక శక్తులను బైండోవర్ చేయాలని సూచించారు. ఎన్నికల ప్రచార పరిశీలనలో, పోలింగ్ మరియు కౌంటింగ్ కేంద్రాల వద్ద సాధ్యమైన మేర డ్రోన్‌ల వినియోగంపై దృష్టి సారించాలని తెలిపారు. ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించి మాస్టర్ ట్రైనర్లు జిల్లాలకు చేరుకుంటారని, పోలింగ్ సిబ్బందికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలను సకాలంలో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు, ఒక మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయిలో సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాల వివరాలను టీ-పోల్ యాప్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన మేర పోలింగ్ బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సిబ్బంది, సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు తదితర సిబ్బందిని ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్‌కాస్టింగ్, వెలుపల సీసీ కెమెరాల ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. నామినేషన్ల స్వీకరణకు అవసరమైన కేంద్రాలను కూడా గుర్తించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

# అవగాహన, రోడ్డు భద్రత నిబంధనల పాటించుటతోనే రోడ్డు ప్రమాదాలకు చెక్





**కరీంనగర్ సీపీ గౌస్ ఆలం**

**జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా 'అరైవ్ - అలైవ్' అవగాహనా సదస్సు**

**గత ఏడాది రోడ్డు ప్రమాదాల్లో 200 మంది మృతి : ఆందోళన వ్యక్తం చేసిన సీపీ**

కరీంనగర్, జనవరి 20, 2026 (జనతా న్యూస్):

రోడ్డు ప్రమాదాల నివారణ కేవలం పోలీసుల చర్యలతో మాత్రమే సాధ్యం కాదని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండి, వాటిని బాధ్యతాయుతంగా పాటించినప్పుడే ప్రమాద రహిత సమాజం సాధ్యమవుతుందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో విద్యార్థుల కోసం నిర్వహించిన 'అరైవ్ - అలైవ్' (ARRIVE -- ALIVE) అవగాహనా కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పలు కీలక అంశాలను వెల్లడించారు.

గత ఏడాది కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల వల్ల 200 మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని సీపీ తెలిపారు. ఈ ప్రమాదాలలో ఎక్కువ శాతం సీట్‌బెల్ట్ ధరించకపోవడం, హెల్మెట్ వినియోగించకపోవడం, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి మానవ తప్పిదాల వల్లే జరిగాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారిలో 85 శాతం మంది పురుషులే ఉండటం గమనార్హమని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ నుంచి హైదరాబాద్, వరంగల్, జగిత్యాల, సిరిసిల్ల, చొప్పదండి వెళ్లే ప్రధాన రహదారుల్లో ప్రమాదాలు ఎక్కువగా జరిగే 'బ్లాక్ స్పాట్లను' గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిఘాతో పాటు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర డీజీపీ ప్రారంభించిన 'అరైవ్ -- అలైవ్' కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నామని, పరిసరాలను గమనిస్తూ వాహనం నడిపే 'డిఫెన్సివ్ డ్రైవింగ్' విధానాన్ని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని సీపీ సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరితో రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, డిటీవో శ్రీకాంత్ చక్రవర్తి, ఏసీపీలు వెంకటస్వామి, యాదగిరి స్వామి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీరాస్వామి, డాక్టర్ సాయిదీప్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ నీలం సంపత్, ఇన్స్పెక్టర్లు రాంచందర్ రావు, సృజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థికి జాతీయ స్థాయి గణిత పోటీలో ప్రతిభ



కరీంనగర్, జనతా న్యూస్ : అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌కు చెందిన విద్యార్థి జాతీయ స్థాయి గణిత పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు గౌరవం తెచ్చారు. ఈ సందర్భంగా కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభకు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డా. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, గణిత శాస్త్రం విద్యార్థుల ఆలోచనా శక్తి, జ్ఞాపకశక్తిని పెంపొందిస్తుందని అన్నారు. పాఠశాల స్థాయిలోనే పోటీలకు అలవాటు చేయడం ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో పోటీ పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొంటారని తెలిపారు. ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి ఆర్యభట్ట గణిత ఛాలెంజ్ పోటీలో 9వ తరగతికి చెందిన ఏ. గౌతమ్ జాతీయ స్థాయిలో తొలి వందమంది విజేతలలో స్థానం సాధించడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. విజేతను పుష్పగుచ్ఛం, అర్హత పత్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అరైవ్--అలైవ్ కార్యక్రమంలో రోడ్డు భద్రత అవగాహన

**మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు : ట్రాఫిక్ ఎస్సై గోపాల్ రెడ్డి**




సిద్దిపేట, జనవరి 20, 2026 (జనతా న్యూస్): కమిషనర్ ఆఫ్ పోలీస్, సిద్దిపేట ఆదేశాల మేరకు 'అరైవ్--అలైవ్' రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట ట్రాఫిక్ ఎస్సై గోపాల్ రెడ్డి, ఉమేష్‌లు తమ సిబ్బందితో కలిసి సిద్దిపేట పట్టణంలోని విపంచి చౌరస్తా వద్ద రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులతో కలిసి ఫ్లెక్స్ కార్డులు ప్రదర్శిస్తూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ట్రాఫిక్ ఎస్సై గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడపడం నేరమని, అలా పట్టుబడితే రూ.10,000 జరిమానా విధించడంతో పాటు, రెండోసారి పట్టుబడితే జైలు శిక్ష కూడా విధించబడుతుందని హెచ్చరించారు. కావున ఎవరూ మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు.

ఇటీవల కాలంలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే జరిగాయని గణాంకాలు చెబుతున్నాయని తెలిపారు. వాహనదారులు తమ కుటుంబాల భద్రతను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. ప్రమాదరహిత తెలంగాణగా రాష్ట్రాన్ని దేశంలో ముందంజలో నిలిపేందుకు ప్రతి పౌరుడు బాధ్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమం అనంతరం వాహనదారులందరితో కలిసి రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ నిర్వహించారు.

# కార్పొరేటర్ ఆశావాహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

**సర్వే ఆధారంగా గెలుపు గుర్రాలకు పార్టీ టికెట్ : కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్**



కరీంనగర్, జనవరి 20 (జనతా న్యూస్): కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశిస్తున్న కార్పొరేటర్ ఆశావాహుల నుంచి కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో మంగళవారం దరఖాస్తులు స్వీకరించారు. కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ జిల్లా కాంగ్రెస్ పంచాయతీరాజ్ సంఘటన చైర్మన్ మడుపు మోహన్‌తో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ, పార్టీ శ్రేణుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి తుది జాబితాను పీసీసీకి పంపించడం జరుగుతుందని తెలిపారు. సర్వే ఆధారంగా గెలుపు అవకాశాలు ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసి, కాంగ్రెస్ పార్టీ సింబల్‌పై పోటీ చేసే అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. నగరంలోని పలు డివిజన్ల నుంచి మొదటి రోజు మొత్తం 255 దరఖాస్తులు అందినట్లు ఆయన తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 22వ తేదీ మధ్యాహ్నం 1 గంటల వరకు గడువు ఉందని, ఆశావాహులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన కార్యకర్తలకు తప్పకుండా న్యాయం జరుగుతుందని, ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

